పుంగనూరు పాలిటిక్స్‌లో



రిలీజ్ ఆన్ 2024 ఎలక్షన్స్

ప్రాబల్యం.. పెత్తనం.. పౌరుషాలతో బిగ్ ఫైట్

ప్రజాశక్తి-పుంగనూరు:

చిత్తూరు జిల్లా పాలిటిక్స్ రాష్ట్ర రాజకీయాలనే శాసిస్తాయి. ఈ జిల్లా నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వారు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి హోదాలో పదవులు అనుభవించారు. నీలం సంజీవరెడ్డి, ఎన్‌టీఆర్, చంద్రబాబునాయుడు, కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి వారు ఈ జిల్లా నుంచే పోటీల్లో విజయం సాధించి ముఖ్యమంత్రులైయ్యారు. ఎందరు ముఖ్యమంత్రులు మారినా నేను మాత్రం పక్కాలోకల్ అనే 'పెద్ద' బలం ఇక్కడి రాజకీయాల్లో పదిలంగా ఉంటోంది. ఆ బలమే బలగమై జిల్లాను కనుసైగతో శాసిస్తోంది. ఆయన చెప్పిందే శాసనం, ఆయన మాటే శిరోధార్యం. అధికార పార్టీలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పాలిటిక్స్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చుట్టూరా పరిభ్రమిస్తున్నాయి. అయితే పుంగనూరు నుంచి మూడు సార్లు అవలీలగా హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళుతున్న పెద్దిరెడ్డికి ఈ దఫా త్రిముఖ పోటీ నెలకొనే పరిస్థితి ఉంది. టీడీపీ నుంచి చల్లా రామచంద్రారెడ్డి బరిలోకి దిగే అవకాశం ఉండగా.. భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకులు బోడే రామచంద్రాయాదవ్ పోటీకి దిగుతున్నారు. దీంతో పుంగనూరు నియోజకవర్గంలో త్రిముఖపోటీ నెలకొనే పరిస్థితి ఉంది. టీడీపీ నుంచి చంద్రబాబు ప్రాబల్యం.. పెద్దిరెడ్డి పెత్తనం.. రామచంద్రాయాదవ్ పౌరుషం నడుమ అక్కడి పాలిటిక్స్ ఇప్పుడు ముగ్గురు రామచంద్రులు (ఆర్.ఆర్.ఆర్)పై చర్చనీయాంశంగా మారాయి.

'పెద్ద'రికంతో సమన్వయం

ప్రస్తుత అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2009 సార్వత్రిక ఎన్నికల నుంచి పుంగనూరు నుంచి హ్యాట్రిక్ విజయాలు సాధించారు. అంతకు ముందు పీలేరు నియోజవర్గంలో మూడు సార్లు విజయం సాధించారు. సుధీర్ఘ రాజకీయ అనుభవంతో తన నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థులుగా తన అనుచర వర్గాన్నే గెలిపించుకొనే స్థాయికి చేరారు. తన పెద్దరికంతో అనుచరవర్గాన్ని బలపరుచుకొని జిల్లాలో తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకున్నారు. సమన్వయంతో అటు నాయకులను, ఇటు కార్యకర్తలను సంతృప్తి పరిచేందుకు అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్నారు. పెద్దిరెడ్డికి ఉన్న నెట్‌వర్క్, ఆయనకున్న అభిమానుల మధ్య పోటీ పడి గెలవడమంటే సాహసమే అవుతుంది.

చతురత చాటుతున్న 'చల్లా'

సుదీర్ఘ కాలం పాటు రొంపిచర్లకు చెందిన చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు) కుటుంబం పీలేరు, పుంగనూరు నియోజకవర్గ రాజకీయాల్లో కీలకంగా ఉంటున్నారు. రొంపిచర్ల మండల ప్రజా పరిషత్‌లో కీలకంగా వ్యవహరించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా చల్లాబాబు పోటీ దాదాపు ఖరారైంది. దీంతో ఆయన గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. గత ఏడాదిలో పుంగనూరు వద్ద జరిగిన అల్లర్ల కేసులో ఆయనను పోలీసులు రిమాండ్‌కు పంపారు. అప్పటిదాకా ఒక లెక్క ఇకపై మరోలెక్క అన్న చందంగా పెద్దిరెడ్డిపై గెలుపే లక్ష్యం అంటూ చల్లారని వేడితో దూసుకుపోతున్నారు. పైగా చల్లాబాబు అనుచరులే అయనకు పట్టుకొమ్మలన్నది బహిరంగం. తన రాజకీయ చతురతతో పెద్దిరెడ్డిపై రాజీలేని పోరాటం చేస్తూ గ్రామాల్లో తిరుగుతున్నారు. పైగా 2024లో గెలుపే లక్ష్యంగా చంద్రబాబు పుంగనూరుపై ప్రత్యేక దృష్టి సారించారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీసీవై జెండాతో బరిలోకి..

అప్పటి దాకా పక్కింటికి కూడా పరిచయం లేని పేరు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. పుంగనూరుకు చెందిన బోడే రామచంద్రాయాదవ్ 2019ఎన్నికల ముందు పొలిటికల్ ఆరంగేట్రం చేశారాయన. 2019ఎన్నికల్లో జనసేన పార్టీ తరపు పుంగనూరు అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తరువాత జనసేన పార్టీని వీడి మంత్రి పెద్దిరెడ్డిపై అనునిత్యం పోరాటం చేస్తూనే వచ్చారు. ఢీ అంటే ఢీ అనేలా అన్నివిధాల ఎదుర్కొంటూ వస్తున్నారు. ఓ దశలో రామచంద్రాయాదవ్ ఇంటిపై పెద్ద ఎత్తున పుంగనూరులో దాడి జరిగింది. మంత్రికి సంబంధించిన పలు విషయాల్లో ఆయన తీవ్రంగా స్పందిస్తూ ఆరోపణలు చేశారు. దీంతో అందరి దృష్టి ఆయనపై మళ్లింది. 2023లో సొంతంగా భారతచైతన్య పార్టీని స్థాపించారు. వైసీపీ, టీడీపీలపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టి రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేపడుతూ పార్టీ కార్యకలాపాలను సాగిస్తున్నారు. పైగా పుంగనూరులో పెద్దిరెడ్డిపై గెలుపే లక్ష్యమని ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన ఉంటానని భరోసానిస్తున్నారు. పుంగనూరులో రామచంద్రాయాదవ్ చేపట్టిన కార్యక్రమాలకు పోలీసులు అడ్డుకోవడం అక్కడ పోలీసులతో ఆయన ఎదురొడ్డి నిలచి వరుస కేసులు నమోదైనా వెన్నుచూపకపోవడంతో ఆయన పుంగనూరు పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారారు. టీడీపీ, జనసేన, బీసీవై పార్టీ పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థిగా రామచంద్రాయాదవ్‌నే ప్రకటిస్తారనే ఊహాగానాలు లేకపోలేదు.

ఆచార్య ఎం.ఎన్.వెంకటేశకు అవార్డు

వెంకటేశను శాలువతో సత్కరిస్తున్న పలువురు

ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం జానపద విభాగ ఆచార్యులు ఎం.ఎన్.వెంకటేశకు కర్ణాటక ప్రభుత్వం 'ప్రొఫసర్ కె.జి.కుందనగర్ గాడినాడ సాహిత్య పురస్కారం'తో సత్కరించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేతుల మీదుగా ఈ అవార్డుతో పాటు రూ.ఐదు లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. కన్నడ అధ్యయన రంగంలో ఆయన చేసిన సేవలకు గాను ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయం తరపున ప్రొఫెసర్ ఎం.ఎన్ వెంకటేశను ఘనంగా సత్కరించారు. వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధు జ్యోతి, ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ ఆచార్య ఏకే.వేణుగోపాల్ రెడ్డి వర్సిటీ తరపున పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఓటరు జాబితాలో తప్పులు
సరిచేయండి: ఎలక్షన్ కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఓటరు జాబితా పబ్లికేషన్ తర్వాత చేర్పులు తీసివేతల విషయాలను అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎన్నికల నిర్వహణ నిమిత్తం అర్ఓల నుంచి ఇతర ప్రధాన సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికలకు సంబంధించి చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మాట్లాడుతూ ఉద్యోగులు, భద్రత సిబ్బంది సంసిద్ధం చేయాలని ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి సంబంధించిన శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన నూతన విధివిధానాల ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఫారం-6 ప్రకారం ఓటర్ల జాబితాలో చేర్పులు ఉంటే 0.1శాతం వరకు ఆర్ఓ పరిధిలో ఉంటుందని ఆపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేయాలన్నారు. అదేవిధంగా తీసివేతలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేసిన ఏర్పాట్లు గురించి జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, గంగాధర్ నెల్లూరు ఎన్నికల అధికారిణి భవాని పాల్గొన్నారు.

'ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండండి'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

ప్రజారోగ్యం పట్ల అధికారులు, సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్లకు నెలసరి సమీక్ష సమావేశం నిర్వహించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు తప్పనిసరిగా ప్రతి వారం పరీక్ష చేసి రిపోర్టులు పంపాలన్నారు. రెండు వారాలు మించి ఉన్న దగ్గు కేసులకు ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా గల్ల పరీక్షించి పాజిటివ్ అయినట్లయితే ఆరు నెలల పాటు మందులు ఇవ్వాలన్నారు. అలాగే ఎల్‌సిడిసి కార్యక్రమం ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ప్రతి గ్రామంలో కుష్ఠు అవగాహన కార్యక్రమాలు స్పర్శ లేని మచ్చలు ఎవరికి ఉన్న వైద్యాధికారి దగ్గర నిర్ధారణ చేయించి ఉచిత మందులు పంపిణీ చేయాలన్నారు. అలాగే మలేరియా అధికారి మాట్లాడుతూ అపరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. ఇండ్ల పరిసరాలలో నీరు నిలవలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోనేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ఫ్రైడే డ్రైడే తప్పక పాటించాలన్నారు. కీటక జనీత వ్యాధులైన మలేరియా, డెంగు ,చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, యాక్టివ్, పాసివ్ రక్తపరీక్షల నిర్వహణపై తగు సూచనలు ఇచ్చారు. పాజిటివ్ వచ్చిన కేసులకు వైద్యాధికారి ద్వారా వెంటనే చికిత్స ప్రారంభించేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు పీరు సాహెబ్, రామకృష్ణ, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరులో ఎంబీటి రోడ్డు విస్తరణ పనులు ఒక్కొక్కరికి ఒక్కోలా అక్రమాలు తొలగిస్తున్నారంటూ పట్టణం వాసులు విమర్శిస్తున్నారు. ధన బలం, రాజకీయ అండ ఉన్నవారికి రోడ్ల విస్తరణలో ఒకలా, పేదలకు మరోలా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పుంగనూరులో రోడ్ల విస్తరణతో మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగిస్తూ మార్కింగ్ ఇవ్వడం జరిగింది. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల అధికార పార్టీ అండ చూసుకొని ఏమాత్రం సహకరించకుండా పోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అవినీతిపై విచారణ జరిపించండి

జేసికి టిడిపి వినతి

జేసికి వినతి పత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ అవినీతి ఆక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ తెలుగుదేశం నేతలు శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కోదండయాదవ్, సప్తగిరిప్రసాద్, మోహన్‌రాజ్, మేషాక్, వెంకటేష్‌యాదవ్, మధుయాదవ్‌లు మాట్లాడుతూ నగర కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికారపార్టీకి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. స్వంత నిధులతో తమ పార్టీకి చెందిన దాత గురజాల జగన్మోహన్ సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేస్తే అనుమతులేవంటూ తొలగించారని ప్రజల మద్దతుతో యధాస్థానంలో ఏర్పాటు చేస్తామన్నారు.

మండలాల్లో అభివృద్ధికి ఐవోసీఎల్ తోడ్పాటు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ రెండు మండలాల్లో అభివృద్ధి పనులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా రూ.65 లక్షలు అందించడం జరిగిందని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం జేసి క్యాంపు కార్యాలయంలో ఐఓసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ యోహాన్ కుమార్ సంస్థ తరపున రూ.65 లక్షల చెక్కును జేసికి అందించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఎస్.ఆర్ పురం మండలం పిళ్ళారి కుప్పంలో కమ్యూనిటీ హాల్, గంగాధరనెల్లూరు మండలం ఆవులపురిలో మైనారిటీ కాలనీ వద్ద సిసి రోడ్డు, డ్రైన్‌ల నిర్మాణానికి రూ.65 లక్షల చెక్కును అందజేశారని తెలిపారు. కార్యక్రమానికి ఐఓసిఎల్ అధికారులు డిప్యూటీ జనరల్ మేనేజర్ కెవివి సతీష్‌కుమార్, సీనియర్ ఆపరేషన్స్ మేనేజర్ బాలమురుగన్, ఆపరేషన్స్ మేనేజర్ చిన్నారి రఘు వంశీలు పాల్గొన్నారు.

చిత్తూరు ఎంపీ విషయంలో యూ టర్న్

చిత్తూరు ఎంపిగా రెడ్డెప్ప
జీడీనెల్లూరుకు నారాయణస్వామి

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటనలో గందరగోళం నెలకొంది. తిరుపతి ఎంపి అభ్యర్థిగా తొలుత ఆదిమూలంను ప్రకటించి, వివాదం నెలకొనడంతో సిట్టింగ్ గురుమూర్తికే అవకాశం ఇచ్చారు. సత్యవేడుకు రాజేష్‌ను ఎంఎల్‌ఏ అభ్యర్థిగా ప్రకటించారు. సర్వేలో నారాయణస్వామి పట్ల వ్యతిరేకత ఉండడంతో అతని కుమార్తె కృపాలక్ష్మికి తొలుత సీటు కేటాయించారు. మంత్రిపెద్దిరెడ్డి జోక్యంతో చిత్తూరు ఎంపి అభ్యర్థిగా నారాయణస్వామిని ప్రకటించారు. సిట్టింగ్ ఎంపి అభ్యర్థి రెడ్డెప్పను జీడీనెల్లూరుకు కేటాయించారు. నారాయణస్వామి అయితేనే టిడిపికి గట్టి పోటీ ఇస్తారని, రెడ్డెప్ప వల్ల కాదని కొందరు సిఎం దృష్టికి తీసుకెళ్లడంతో యథావిధిగా పాత పద్దతినే కొనసాగించారు. శుక్రవారం విడుదలచేసిన ఆరో విడత జాబితాలో నారాయణస్వామిని జీడీనెల్లూరుకు, రెడ్డెప్పను చిత్తూరు ఎంపి అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించారు. ఏమైనప్పటికీ అధికార వైసిపిలో అభ్యర్థుల ప్రకటనలో తికమక నెలకొంది.

'రా.. కదలిరా'
సభా ఏర్పాట్లు పరిశీలన

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ఈనెల 6న గంగాధరనెల్లూరులో నిర్వహించబోయే 'రా కదలిరా' చంద్రబాబు నాయుడు సభ ఏర్పాట్లును టీడీపీ నేతలు గురజాల జగన్మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్, పులివర్తి నానితో పాటు పలువురు ముఖ్య నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు రెట్టించిన ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు కదులుతున్నట్లు చెప్పారు. టీడీపీ, జనసేన సంయుక్తంగా నిర్వహిస్తున్నా 'రా.. కదలిరా' సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శివాలయంలో భద్రతా వైఫల్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మరోసారి భద్రతా వైఫల్యం బయటపడింది. భద్రతా సిబ్బంది కనుగప్పి ఓ తొమ్మిదో తరగతి విద్యార్థి ఆలయ ప్రాంగణంలోకి చొరబడ్డాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే..దర్శనం, పూజాధికార్యక్రమాలు పూర్తయిన తర్వాత గురువారం రాత్రి తొమ్మిది గంటలకు యధావిధిగా మూత వేశారు. ఈ క్రమంలో ఆలయ మూడో గేటు నుంచి గోడ వద్ద ఉంచిన నిచ్చెన సాయంతో ఓ విద్యార్థి ఆలయ ప్రాంగణంలోకి చొరబడ్డాడు. దాదాపు అర్ధరాత్రి రెండు గంటల వరకు ఆలయం ప్రాంగణంలో కలియ తిరిగి తిరిగి అదే గేటు నుంచి బయట పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు ఆ విద్యార్థిని పట్టుకొని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే ఆ విద్యార్థి తల్లిదండ్రులపై అలిగి ఆలయంలో తలదాచుకున్నట్లు తెలిసింది. అయినా ఓ విద్యార్థి అర్ధరాత్రి భద్రతా సిబ్బంది కన్నుగప్పి ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో శివలింగాలతో కొందరు ఆలయంలోకి ప్రవేశించడం, ప్రైవేట్ ఆల్బమ్ షూటింగ్ చేయడం ఇలాంటి భద్రతా వైఫల్యాన్ని ఏలెత్తి చూపే ఘటనలు జరిగాయి. తాజాగా మరో ఘటన జరగడంతో ఆలయ భద్రత వ్యవస్థపై ప్రభావం తీవ్రంగా చూపుతోంది.

శ్రీవారిసేవకుల అత్యుత్సాహం
రోజాపై రాజధాని ఒత్తిడి

ప్రజాశక్తి -తిరుమల:

మంత్రి రోజాకు తిరుమల కొండపై నిరసన సెగ తగిలింది. శుక్రవారం ఉదయం రోజా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతర ఆలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత అమరావతి ప్రాంతం నుంచి వచ్చిన శ్రీవారి సేవకులు ఆమెను చుట్టుముట్టారు. ఆమెతో సెల్ఫీలు దిగుతూనే జై అమరావతి, ఏపీకి ఒకటే రాజధాని, వందేమాతరం అని నినాదాలు చేశారు. జై అమరావతి అని మీరూ చెప్పండి అని రోజాను అడిగారు. అయితే.. రోజా చిరునవ్వులు చిందిస్తూనే 'శ్రీవారి సేవకు వచ్చి ఇదేంది?' అంటూ అక్కడి నుంచి ముందుకు సాగారు. సేవకులను వెంటనే తిరుమల నుండి పంపేయాలని ఈఓ ఆదేశించారు.

బడ్జెట్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బడ్జెట్ పై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన అవసరమని పబ్లిక్ రిలేషన్ ఆఫ్ ఇండియా నిర్వాహకులు భాగ్య తేజ తెలిపారు. స్థానిక న్యూ బాలాజీ కాలనీ ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బడ్జెట్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ అకౌంట్ బడ్జెట్లో సాధారణ ప్రజలపై ఎలాంటి భారాలు వేయకుండా, బడ్జెట్ ప్రవేశ పెట్టారన్నారు. రక్షణ రంగం, సాంకేతిక రంగానికి అధిక నిధులు కేటాయించడం భవిష్యత్తు పరిణామాలకు శుభపరిణామం అన్నారు. ఏదేమైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్ పై సాధారణ ప్రజానీకానికి సైతం అవగాహన అవసరమని, దీని ద్వారా తమకు అవసరమైన వాటిని ప్రభుత్వాలను ప్రశ్నించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సి వాణి, రమాకాంత్ శర్మ, త్రిపుర సుందరి, హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఎన్ బి సుధాకర్ పాల్గొన్నారు.

నగరి డీఎస్పీగా నరసింహామూర్తి

డీఎస్పీ నరసింహామూర్తి

ప్రజాశక్తి-నగరి: నగరి డీఎస్పీగా నరసింహామూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో ఉన్న డీఎస్పీ రవికుమార్ వైఎస్సార్ కడపజిల్లాకు బదిలీపై వెళ్లడంతో కర్నూలు నుంచి పదోన్నతిపై నగరి డీఎస్పీగా నరసింహామూర్తి నియమితులయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మార్చి 1 నుండి 20 వరకు ఇంటర్ పరీక్షలు
- పరీక్షలు రాయనున్న 32,757 మంది విద్యార్థులు

సమీక్షిస్తున్న డిఆర్ఓ రాజశేఖర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని విజయవంతంగా నిర్వహించాలని డిఆర్ఓ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం డి.ఆర్.ఓ సమావేశం మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ, వైద్య, రవాణా, విద్యుత్తు పోలీసు, పోస్టల్, ఖజానా, మున్సిపాలిటీ, పంచాయతీ, ఆర్‌టిసి, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో మార్చి1 నుండి 20వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబందితా అధికారులు సమన్వయం చేసుకొని ఏ లాంటి చిన్న పొరపాట్లు జరగకుండా జాగ్రతగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో 50పరీక్ష కేంద్రాల్లో 32,757మంది అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు-15,905 మంది, ఇంటర్ రెండో సంవత్సరం 16,852 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12వరకు ఉంటుందని, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్ టిక్కెట్లును సంబంధిత కళాశాలలో సకాలంలో విద్యార్థులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో సిటింగ్, లైటింగ్, త్రాగు నీరు, మరుగుదొడ్లు ఉండేలా చూడాలని సంబందిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్.టి.సి బుస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను, పరీక్ష సమయంలో విద్యుత్ ఆంతరాయం కలగకుండా చూడాలని సంబందితా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు రవాణా శాఖ అధికారులు అవసరమైన వాహనాల ఏర్పాట్లు చేయాలని, పరీక్షలు పూర్తి అయిన తరువాత సమాధాన పత్రాలను సీల్డ్ కవర్‌లో పోస్టల్ శాఖకు అందజేసిన వెంటనే పోస్టల్ శాఖ పంపించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల నందు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్స్, ఏ.ఎన్.ఏంలను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. మున్సిపాలిటిలోను, పంచాయతీలలోను పరీక్ష కేంద్రల నందు శానిటేషన్ చేయాలని ఆదేశించారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష కేంద్రాల సమీపంలో వున్న జిరాక్స్ షాప్‌లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన పోలీసు బందోబస్తును, పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కేమరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం డీఈవిఓ సైయాద్ మౌలాల, డిఈసి మెంబర్ల దయానంద రాజు, బాల సుబ్రహ్మణ్యం రాజు, మురళి కృష్ణ, డిఈఓ విజయేంద్ర రావు, వైద్య ఆరోగ్య, విద్యుత్, ఆర్‌టిసి, తపాలా, ఖజానా శాఖలదికారులు అధికారులు పాల్గొన్నారు.

జంట ఏనుగుల
స్వైర విహారం

- పేగలవారిపల్లె అటవీ ప్రాంతంలో సంచారం
- భయాందోళనలో పరివాహ ప్రాంత రైతులు


పేగలవారిపల్లి అటవీ ప్రాంతంలో జంట ఏనుగులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని తమ్మినాయునిపల్లి పంచాయతీ పేయగలవారిపల్లె అటవీ ప్రాంతంలో జంట ఏనుగులు శుక్రవారం సాయంత్రం సంచరించాయి. అటుగా వెలుతున్న గొర్రెల కాపరులు, రైతులు గుర్తించి అటవీ సిబ్బందికి తెలియజేశారు. ఇరికిపెంట చెన్నపట్నం చెరువు మొరవ వద్ద పలువురు రైతులకు చెందిన పంటలపై దాడి చేశాయి. వారు టపాసులు పేలుస్తూ వాటిని అడవిలోకి తరిమెందుకు ప్రయత్నించగా అవి బంగ్ల(పార్వతినగర్) గ్రామ సమీపం నుండి మేటిమంద అటవీ ప్రాంతానికి వెళ్లిన సంగతి తెలిసిందే. అవే జంట ఏనుగులు శుక్రవారం ఎలాంటి పంట నష్టము కలుగజేయకున్నా పేగలవారిపల్లి అటవీ సమీప రైతుల భూముల వద్ద సంచరిస్తూ కనిపించాయి. వాటిని అడవిలోనికి తరిమేందుకు ప్రయత్నించగా అవి కందూరు-మదనపల్లె ప్రధాన రహదారిని దాటి నిమ్మనపల్లె మార్గం గుండా వెళ్లినట్లు సమాచారం. ఇదివరకు ఎప్పుడూ ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరించిన ఆనవాళ్లు లేవు. జంట ఏనుగులు గుంపులోంచి విడిపడి ఇరికిపెంట, మేటిమంద, పేగలవారిపల్లి గ్రామాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో తిరుగుతూ ఉండొచ్చునని రైతులు అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ ప్రాంత ప్రజలు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

ప్రజాశక్తి-సోమల: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 15 పంచాయతీలలో 2022-2023 ఆర్థిక సంవత్సరానికి గానూ జరిపిన పనులకు సంబంధించి ఆడిట్ బృందం తనిఖీలు చేపట్టారు. 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను శనివారం స్త్రీ శక్తి భవనం ఎదురుగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. డిఆర్‌డిఏ పిడి గంగా భవాని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, డివిఓ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

రేపు 'సభా' జయంతి సదస్సు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా సాహితీ ఆణిముత్యం స్వర్గీయ కె.సభా శత జయంతి సదస్సు చిత్తూరులోని కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవనంలో ఆదివారం నిర్వహించనున్నట్లు రచయితల సంఘం నాయకులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, రామలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్గీయ కె.సభా జీవిత విశేషాలు, కథలు, బాల సాహిత్యం, నవలలు, రచనలు, నాటికలు తదితర సాహిత్య ప్రక్రియలపై సుదీర్ఘంగా పరిచయ, అవగాహనా కార్యక్రమాలు సాహిత్య అకాడెమీ, చిత్తూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

'షర్మిల దీక్షతో ఏపీ కాంగ్రెస్‌లో నూతనోత్సాహం'

ప్రజాశక్తి-పుంగనూరు: పీసీసీ అధ్యక్షులు షర్మిల ఆధ్వర్యంలో విభజన హామీల కోసం ఢిల్లీలో చేపట్టిన దీక్ష ఏపీ కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం వస్తోందని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జద్ భాష శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీక్ష చేయడం కాంగ్రెస్‌లో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందని పేర్కొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-సదుం: దోమలు నియంత్రణపై స్థానిక ప్రభుత్వ వసతి గృహాలలో శుక్రవారం డాక్టర్ శ్రీగిరీష ఆధ్వర్యంలో మలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఆమె మాట్లాడుతూ వసతి గృహాలలో విద్యార్థులు దోమల వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు స్థానిక బాలురు వసతి గృహంలో, ఎంజెపి ఏపి బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాలలో శుక్రవారం మలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, డిఎం షరీఫ్, వైద్య సిబ్బంది సాగర్, ఉదయ భాస్కర్, నీలకంఠ, రషీద్, శ్రావణి, ఆశా వర్కర్లు రేవతి పాల్గొన్నారు.

పింఛన్ అందజేత

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన కుప్పయ్య శెట్టి అనారోగ్య కారణంతో తిరుపతిలోని సిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం సిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయనకు తూగుండ్రం సచివాలయం చెందిన వాలంటీర్ జి.ఇందిరా తన సొంత ఖర్చులతో ఆసుపత్రికి వెళ్లి పింఛను రూ.10వేలు అందించారు.

అన్నదానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అన్నా క్యాంటీన్‌కు విశేష స్పందన వస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఉచిత అన్న క్యాంటీన్లో ఉచిత భోజన పంపిణీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ ఐదో తారీకు నుండి క్రమంగా అన్న క్యాంటీన్లో మధ్యాహ్న భోజనాన్ని ఉచితంగా పేదలకు అందిస్తున్నట్టు ప్రతిరోజు ఎవరో ఒక కార్యకర్త అన్నదానానికి సహకారం అందిస్తున్నట్లు వారికి పార్టీపై ఉన్న అభిమానాన్ని వ్యక్తపరుస్తున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, సర్పంచ్ కోకా ప్రకాష్‌నాయుడు, మాజీ సింగల్‌విండో అధ్యక్షులు హేమచంద్రనాయుడు నాయకులు ధరణి, మంజు, రమేష్, గురుస్వామి, రవి పాల్గొన్నారు.

మఠం భూముల్లో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హాథీరాంజీ మఠంకు చెందిన భూముల్లో అక్రమంగా నిర్మించిన శాశ్వత కట్టడాలను మఠం అధికారులు తొలగించారు. మఠం ఏఈఓ శ్రీనివాసుల రెడ్డి కథనం మేరకు హాథీరాంజీ మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు ఆదేశాల మేరకు తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామపంచాయతీ లెక్కదాఖల సర్వేనెంబర్ 364, 368లోని చెంచులక్ష్మి కాలనీలో మఠంకు సంబంధించిన భూమిలో కొందరు అక్రమంగా శాశ్వత నిర్మాణాలను చేపట్టారన్నారు. అక్రమంగా నిర్మించిన ఇళ్లను జెసిబితో కూల్చివేశామన్నారు. హాథీరాంజీ మఠంకు చెందిన భూములలో అక్రమంగా ప్రవేశించిన, నిర్మాణాలు చేపట్టిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను వివరించండి: మాజీ ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలను గ్రామాల్లో తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వైసీపీ కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల్లో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు చెప్పారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీని ఆదరించి మరో సారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మొదట పార్టీ నాయకుడు చాన్ బాషా మృతి పట్ల సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మోహన్‌రెడ్డి, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, జెడ్పిటిసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జయకుమార్, ఏఎంసీ ఛైర్మన్ నారే సోమశేఖర్, సింగల్ విండో అధ్యక్షులు దత్తరెడ్డి, సర్పంచులు వాణిప్రియ, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, శ్రీహరి, ఎంపీటీసీలు ఉషారాణి, హేమచంద్ర, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'కుప్పంని అభివృద్ధి చేసింది చంద్రబాబే'


కరపత్రాలను అందజేస్తున్న ముస్లిం నేతలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది చంద్రబాబు నాయుడు మాత్రమే నని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అన్సర్, మునాఫ్, ప్రచార కమిటీ నాయకులతో మస్జిద్ ఏ కుబా సమీ పాన బాబాయి మఠం ఇంటింటికి వెళ్లి హర్ ఏక్ కా నారా చంద్రబాబు నాయుడు హమారా అని కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు చేసిన అభివృద్ధిని కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా గాజుల ఖాదర్బాషా మాట్లాడుతూ కుప్పం పట్టణ పాత బైపాస్ రోడ్డు ప్రక్కన 32 సెంట్లు భూమిని మైనార్టీ షాదీఖానా కొరకు కేటాయించారని, కుప్పం పట్టణం నందు మైనారిటీల కొరకు కమ్యూనిటీ సెంటర్, మైనార్టీ సెంటర్ అనుకొని రూ.56లక్షలతో షాది మహల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కుప్పం నియోజకవర్గ మొత్తము కబ్రస్థానలకు ప్రహరీ గోడలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా చంద్రబాబునాయుడు చేపట్టిన పలు అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ నాయకులు ఇమ్రాన్, ముజాహిద్, పట్టణ అధ్యక్షులు ఉమర్, సలీం, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

'రా కదిలిరా' సభకు తరలిరండి: గాలిభాను

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈనెల 6వ తేదీ జిడి నెల్లూరులో జరిగే నారా చంద్రబాబు నాయుడు 'రా..కదలి రా..' బహిరంగ సభను విజయవంతం చేయాలని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక జిడిఆర్ కళ్యాణ మండపంలో జరిగిన సన్నాహక సమావేశంలో గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలోని ప్రతి వార్డు నుంచి, రూరల్ మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి కనీసం వంద మందికి తగ్గకుండా ప్రజలు ఈ కార్యక్రమానికి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాకదలిరా నియోజకవర్గ పరిశీలకులు, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పుత్తూరు రూరల్ మండల పరిధిలో కన్నయ్య నాయు డు, పుత్తూరు పట్టణ, రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు జి.జీవరత్నం నాయుడు, డి రవికుమార్ ప్రధాన కార్యదర్శులు ఎన్ఎన్ ధనపాల్, ఏ.బాలాజీ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగ్గరెడ్డి, పుత్తూరు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్లు డి ఎస్ గణేష్, ఏ.ఆనంద్, ఎస్. ప్రతాప్ రాజు పాల్గొన్నారు.

'లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు లయన్స్ క్లబ్ జిల్లాలోని సీనియర్ క్లబ్ అని 56 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని లయన్స్ క్లబ్ గవర్నర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు మండల పరిధిలోని విందూరులో హైస్కూల్ పిల్లలకు స్పోర్ట్స్ సామగ్రి , స్కూలుకు బ్యాటరీ, విందూరు కాలనీ పేదలకు దుప్పట్లు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. గూడూరు సరస్వతి శిశు మందిరంలో పేదలకు ఫల సరుకులు, గిరిజనులకు చీరలు, కుట్టు పేద మహిళకు కుట్టు మిషను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్లబ్ సేవలు అభినందనీయం అన్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ , గూడూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్ రవిచంద్ర, క్లబ్ సెక్రటరీ కే శివయ్య ,ట్రెజరర్ పి వీరేంద్రనాథ్ ,జోన్ చైర్మన్ గురునాథం, సోమిశెట్టి చెంచురామయ్య, మురళి రెడ్డి, రామ్మోహన్ రావు , రూపేష్ రెడ్డి, రమణయ్య పంచాయతీరాజ్ డిఇ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలంలో వికృతమాల, అరవి కండ్రిగ, గుడిమల్లం, చెల్లూరు, ఎండి పుత్తూరు, బండారుపల్లి, కొత్త వీరాపురం, మునలిపేడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంట పొలాల్లో ఎలుకల నివారణకు బ్రో మోడియోలిన్ అనే ముందును నూకలు, నూనెతో కలిపి ఎరను తయారు చేసుకునే డెమొన్‌స్ట్రేషన్ విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కె.షణ్ముగం, విఎఏ మహేష్, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని కాపుగున్నేరి రైతు భరోసా కేంద్రం ఆవరణలో శుక్రవారం ఏడిఏ ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ గురించి రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ధనుంజయ రెడ్డి, శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ అధికారి రమేష్ రెడ్డి, శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, వీ.ఎ.ఏ పావని , రైతులు పాల్గొన్నారు.

చంద్రగిరి సిఐ రామయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి పోలీస్ స్టేషన్ సిఐగా రామయ్య శుక్రవారం ఉద్యోగ భాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ రాజశేఖర బదిలీ పై తిరుమల స్పెషల్ బ్రాంచ్ కు వెళ్లారు. సిబ్బంది కొత్త సిఐ రామయ్యకు పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు.

ప్రజల్లో మార్పు తీసుకురావాలి: రిటైర్డు జడ్జి

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రజల్లో మార్పు తీసుకు రావాల్సిన భాధ్యత చదువుకున్న వారిపై ఉందని రిటైర్డ్ జిల్లా జడ్జి గురప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బహుజన సమాజ పార్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజక వర్గ ఆ పార్టీ ఇన్‌ఛార్జి జోరేపల్లి వెంకటేశ్వర్లు (వెంకన్న). శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు, చిత్తూరు జిల్లా అభ్యర్థి వేణుగోపాల్ పాల్గొన్నారు.

జంతువుల పట్ల దయ ఉండాలి

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నగరి: జంతువుల పట్ల దయ కలిగివుండాలని పుత్తూరు డివిజన్ ఉపసంచాలకులు టి.గోవిందయ్య అన్నారు. శుక్రవారం మండల, మున్సిపల్ పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జంతు సంక్షేమం, అవగాహన, జంతువుల హింస చట్టంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పశుసంవర్ధక, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన సమావేశంలో పుత్తూరు డివిజన్ ఉపసంచాలకులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమతో వ్యవహరించాలని, హాని కలిగించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, నమశ్శివాయం, పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి: డాక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-యాదమరి: కుష్టు రహిత సమాజ స్థాపనకు అందరం కృషి చేద్దామని జిల్లా కుష్టు, ఎయిడ్స్ నిర్మూలన అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా కుష్టు వ్యాధిపై అవగాహన, సర్వే కార్యక్రమం ప్రతి సంవత్సరం చేపడతారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన యాదమరిలో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, లక్ష్మీనారాయణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కుష్టు, ఎయిడ్స్ కంట్రోల్, టీబీ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ర్యాలీలో పాల్గొన్నారు. యాదమరిలో మనవాహారం నిర్వహించారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ కుష్టు రహిత సమాజ స్థాపనకే ఈ ర్యాలీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిపిఎంవోలు మణి, రవికుమార్, జాన్ శివకుమార్, హెల్త్ సూపర్వైజర్ అనసూయమ్మ, ఎంఎల్పీహెచ్వోలు ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం అని మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని టేకుమంద పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ రత్తయ్య ఆధ్వర్యంలో జరిగింది. గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జడ్పిటిసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్నాథ్, ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం కలిజవేడు సచివాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలిజవేడు సర్పంచి లీలావతి పాల్గొని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ దేయమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దుర్గాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, సిహెచ్ఓ శ్రీనివాసులు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి మహేష్, సర్పంచ్ చిన్న బుడ్డమ్మ, సాంబయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కేజీయ రాణి గైనకాలజిస్ట్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ జనరల్ మెడిసిన్, డాక్టర్ విజయ్ చంద్ర, సురేందర్ రెడ్డి కంటి వైద్యులు డాక్టర్లచే వివిధ వ్యాధులతో బాధపడుతున్న ఆక్కడికి హాజరైన 302 మంది వైద్య సేవలు అందించారు.

గూడూరు, ఎస్.పేట, సత్యవేడులలో ఎపిడబ్ల్యుజెఎఫ్ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి - నాయుడుపేట, బిఎన్ కండ్రిగ: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నియోజకవర్గ నూతన కమిటీలు గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడులలో శుక్రవారం ఏర్పాటయ్యాయి. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వళిగళం గోపి, జిల్లా అధ్యక్షులు శ్రీధర్, కోశాధికారి జె.తులసీరామ్ పర్యవేక్షణలో కమిటీల ఎంపిక జరిగింది. నాయుడుపేటలో జరిగిన కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ యూనియన్ అధ్యక్షునిగా దొరవారిసత్రం విలేకరి బందెల ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నాయుడుపేట విలేకరి దారా అరుణ్, కోశాధికారిగా ఓజిలి విలేకరి ఎస్కె రఫీని ఎంపిక చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడాలని, యూనియన్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జర్నలిస్టుల హౌస్‌సైట్లు, హెల్త్‌కార్డులు, పిల్లల చదువులకు సంబంధించి యూనియన్ ముందు పీఠిన పోరాడుతోందన్నారు. అక్రమంగా జర్నలిస్టులపై జరిగే దాడులను ఎదుర్కోవాలన్నారు.

సత్యవేడు నియోజకవర్గం అధ్యక్షులుగా బి.వేణు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బి.వేణు మాట్లాడుతూ ఫెడరేషన్ అధ్యక్షునిగా తనపై నాయకులు నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా ముందుండి బాధ్యతగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల విలేకరులు హాజరై వేణును శాలువాతో సత్కరించారు.

గూడూరులో అధ్యక్షులుగా వంజివాక మోహన్, వైస్‌ప్రెసిడెంట్‌గా ఉమ్మడి శశిధర్, డివిజన్ కమిటీ మెంబర్‌గా నెల్లిపూడి బాబు, ప్రధాన కార్యదర్శిగా పిట్టి రాజేంద్ర, ట్రెజరర్‌గా ముత్యాలయ్య, సంయుక్త కార్యదర్శిగా తిరుమల శెట్టి నారాయణలను ఎంపిక చేశారు.

సంక్షిప్త వార్తలు

వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా నితిన్

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా రామకుప్పం మండల జెడ్పిటీసీ నితిన్ రాఘవరెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ స్థాయిలో వైసీపీ చేపడుతున్న పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నితిన్ రెడ్డి కీలక పాత్ర పోషించడంతో పార్టీ అధిష్టానం నితిన్‌రెడ్డి సేవలను గుర్తించి యువజన విభాగ అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా నితిన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని నియమించినందుకు గాను పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. నియోజకవర్గ యువత అధ్యక్షుడిగా తనను నియమించిన సీఎంకి, మంత్రి పెద్దిరెడ్డికి, ఎంపీ రెడ్డప్పకి, ఎమ్మెల్సీ భరత్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

పదోతరగతి పరీక్షలపై ఆధైర్యపడకండి: ఎంపీపీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులు అధైర్యపడకుండా ధైర్యంగా పరీక్షలు రాసేందుకు సిద్ధం కావాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్కేఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై ఆ పాఠశాల హెచ్ఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ పరీక్షలపై భయం వీడి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని, అలాంటి అవకాశాలను విద్యార్థులు అంది పుచ్చుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీకళాశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు విజయులు రెడ్డి, స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించ వచ్చని చూసించారు. విద్యార్థులకు విద్యాభ్యాసంలో క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్థి జీవితానికి ఒక మలుపు లాంటిదని. అనంతరం పలువురు అధికారులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదోతరగతిలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించే మార్గాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోద్కుమార్ డైట్ అధ్యాపకులు చెంగల్ రాజు, మాధవరెడ్డి, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ని బలోపేతం చేద్దాం'

పార్టీలో చేరిన మైనార్టీ యువత

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కలిసి కృషి చేద్దామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి సింగం రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రం పుంగనూరులో కాంగ్రెస్ పార్టీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వం వైభవం తేవడానికి ఏపీ పీసీసీ అధ్యక్షులు షర్మిల బాధ్యతలు తీసుకున్నారని ఆమె అడుగు జాడల్లో అందరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సింగం రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాజిద్ అలీ సమక్షంలో పుంగనూరు పట్టణానికి చెందిన మైనార్టీ యువత ఎస్.మౌసీనా, ఎస్.హాసిఫ్స్, ఇమ్రాన్, ఎస్.బాబులాల్, మౌసీనా, ఎమ్మెస్ హాసిఫ్ వారు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సమావేశానికి నాయకులు రాజశేఖర్, శ్రీదేవి, ఈశ్వర్, కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ నాసిర్ బాషాలు పాల్గొన్నారు.

గృహప్రవేశంలో మాజీ మంత్రి

ప్రజాశక్తి-యాదమరి: పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం మహిళా అధ్యక్షురాలు, క్లస్టర్ ఇంఛార్జ్ వి.చిత్రా నాయుడు స్వగ్రామం పెరగాండ్లపల్లె గ్రామంలో నిర్మించిన నూతన గృహ ప్రవేశంకు టిడిపి మాజీ మంత్రి యన్.అమర్‌నాథ్ రెడ్డి, పూతలపట్టు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్‌లు హాజరయ్యారు. వీరిని మండల మహిళా అధ్యక్షురాలు వి.చిత్రా నాయుడు సాదరంగా ఆహ్వానించారు. గృహ ప్రవేశం సందర్భంగా వి.చిత్రానాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. గృహ ప్రవేశం అనంతరం అక్కడ నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతం పూజలో యన్.అమర్‌నాథ్ రెడ్డి, కలికిరి మురళి మోహన్‌లు పాల్గొన్నారు. ఈ గృహ ప్రవేశం కార్యక్రమంకు జిల్లా నుండి హాజరైన టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మాజీమంత్రి కొంత సేపు ముచ్చటించారు. మండలంలోని రాజకీయ పరిస్థితులపై ముఖ్య నాయకులతో మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, మండల అధ్యక్షుడు మురాజీ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కుప్పం: వన్నియకుల క్షత్రియులకు పెద్దపీట వేసింది చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మున్సిపల్ పరిధిలోని సామగుటపల్లిలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్నియకుల క్షత్రియుల కోసం చంద్రబాబు చేసిన పనులను కరపత్రాలుగా ముద్రించి, ప్రజలకు వివరించే కార్యక్రమానికి టీడీపీ నేతలు శ్రీకారం చుట్టారు. అనంతరం సామగుట్టపల్లిలోని కరపత్రాలను అందజేసి, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వన్నియకుల క్షత్రియులకు కమ్యూనిటీ భవనాన్ని నిర్మించింది చంద్రబాబు అని పేర్కొన్నారు. కమ్యూనిటీ భవనానికి రంగులు వేసి వైసిపి ప్రభుత్వంలో నిర్మించినట్లు వైసీపీ నేతలు హడావిడి చేసి ప్రారంభించారని విమర్శించారు. కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించలేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాబోయేది టీడీపీ అని ఆయన స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే, కుప్పం నియోజకవర్గంలోని యామగానిపల్లి, వెండుగంపల్లి, కర్లగట్ట, పిబి నత్తం గ్రామాల్లో ఉన్న ధర్మరాజు ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. అనంతరం సామగుటపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలు పరామర్శించారు.

సంజయ్ కుటుంబానికి పరామర్శ

సామగుట్టపల్లికి చెందిన సంజయ్ ఇటీవల ప్రమాదవశాత్తు బంగనాథం చెరువులో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్చార్జి పి.ఎస్ మునిరత్నం శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సంజయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయానందరెడ్డిని గెలిపించుకుందాం: న్యాయవాదులు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సేవా తత్పరుడు, మంచి వ్యక్తి వైసీపీ అభ్యర్థిగా చిత్తూరు నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న ఎంసీ విజయా నందరెడ్డిని గెలిపించుకోవాలని చిత్తూరు న్యాయవాదులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో న్యాయవాదుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీ విజయనందరెడ్డి చిత్తూరు నియోజకవర్గంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను పలువురు న్యాయవాదులు కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు డిప్యూటీ మేయర్, సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్, లోకనాథరెడ్డి, పులికంటి రవీంద్రనాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఆర్ వేషధారణంలో ప్రచారం

తమిళుల ఆరాధ్య దైవం, మక్కల్ తిలకం ఎంజీఆర్ వేషదారణతో వైసిపి అభ్యర్థి విజయానందరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నగరపాలక పరిధిలోని 40వ డివిజన్‌లో స్దానిక కార్పొరేటర్ గణేష్ మేస్త్రి ఆధ్వర్యంలో తోటపాళ్యంలో వాడవాడలా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. విజయానందరెడ్డి ప్రచారర్యాలీకి స్దానిక తోటపాళ్యం ప్రజలు, మహిళలు బ్రహ్మరథం పట్టారు.

ఎంపిడివోకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి -నాయుడుపేట: నూతనంగా నాయుడుపేట ఎంపీడీవో గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్ ఉదయం వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మానవ సేవయే మాధవ సేవ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శ్రీ రామకృష్ణ మఠం, పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం సమిష్టి సహకారం తో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు శుక్రవారం పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంపిణీ చేశారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్ రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రామకృష్ణ మఠం విశ్రాంత ఉద్యోగుల సంఘం సహకారంతో పేదలకు సహాయం అందిస్తున్నామని ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం కార్యదర్శి కటారి ముని కృష్ణయ్య, విశ్రాంత సంఘం , సభ్యులు కృపావరమ్మ యుగంధర్ రాజు, రవిశంకర్, కుప్పయ్య, రామమూర్తి రాజు, వైద్యులు డాక్టర్ కృష్ణ కాంత్, డాక్టర్ పల్లవి, హెడ్ నర్సు దిల్ షాద్ పాల్గొన్నారు.

రేణిగుంట : క్యారేజీ రిపేర్ షాప్ లోని బృందావనం పార్కులో స్వామి వివేకానంద జయంతిని ఆ కమిటీ సభ్యులు డి. నాగరాజు, విజయ శేఖర్ రెడ్డి,సీనప్ప, సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ దేవ సహాయం వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ముఖ్య నాయకులు మునయ్య, సురేందర్ రెడ్డి, మల్లికార్జున, గణేష్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయ నిర్వాహకుడు ప్రతీష్‌పై దాడి

ప్రజాశక్తి-నగరి: మంత్రి ఆర్కే రోజా కార్యాలయ నిర్వాహకుడు, వైసీపీ నాయకుడు ప్రతీష్‌పై దాడి జరిగిన సంఘటన రాష్ట్ర సరిహద్దు తమిళనాడుకు చెందిన తిరుత్తణిలో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళుతుండగా ముసుగువేసుకొని వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఇనుపరాడ్లతో ప్రతీష్‌పై దాడిచేశారు. అరుపులు విని స్థానికులు అక్కడకు చేరుకోవడంతో దాడికి పాల్పడ్డ వారు పరుగులు తీశారు. తీవ్రగాయాలపాలైన ప్రతీష్‌ను తిరుత్తణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఉన్నత వైద్యసేవలకు గాను చెన్నై మియాట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు అతనికి చికిత్స అందిస్తున్నారు. తిరుత్తణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మదిఅరసన్, ఎస్ఐ రాకికుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాజకీయపరమైన కక్ష్యలే కారణంగా ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.